# మనసు పుట్టుద్ది

ఆళ్లింటికి ఎనకాతల సింతసెట్టు కింద రోట్లో మినపప్పు రుబ్బుతుండది సుద్దమ్మ. నిన్న మాపిటాల వుండట్టుండి సుద్దమ్మకు మినపగారెల మీదకు మనసు మల్లింది – నెల్దప్పి యియ్యాల్టికి అయిదు మాసాలమీన యింకాత్తె కొరదలావుండ మడిసికి, యాలాపాలా లేకుండా యిట్టాటియి తినిపియటం బొహుపెవాఁదం– అయితే తన తోడికోడలు రాగమ్మ కన్నా సుద్దమ్మకు వుండాల్సిన గుండె బిగువుంది. సుద్దమ్మను పెంచుకుండ సుక్కమ్మ సచ్చిపోతా కూతురుకు రెండెకరాల మెట్టుబూమీ, కాత్తె రొక్కం ఎనకేసి పోయింది.

ఆటిమీన తన యవారం యిట్టాటిదని తోడికోడలు రాగమ్మకు తెలుత్తావుంటం సుద్దమ్మకు బొహుమనసు–ఆమాటకొత్తే, వయినంగా రాగమ్మకూ నాలుగు నెల్లు కరకట్టుగా వుండయి.......

చరే యియ్యాల మద్దానం పప్పు రుబ్బుతుండది సుద్దమ్మ.

“మా కోడలు యియ్యాలేందో పనిమీనుండదే?” అంటా పొరుగింటి ఆచ్చేసమ్మ, సుద్దమ్మను యిశారియ వొచ్చింది.

“యీ చాసమ్మకు పనేంలా. యాడసూసుద్దో దూడబాతకుమల్లే ఎగురుకుంటా ఒచ్చుద్ది – యీడేం పీక్కదింటుండారనో? అనుకుండది సుద్దమ్మ. ‘దా చాసమ్మత్తా. ఆఁ . యీయినేవోఁ నిన్న మాపిటాల ఓ గిద్దెడు పప్పు నానెయి మంటేనూ – కిందటేడు మినువుఁలు ఓ అర్సోలెడు మిగిలుండయిలే?”

“అయితే కొడుక్కి నెల్దప్పిందెట్టా!”

“సాల్లే. సెతురాడి సంపుతావు మాటకు ముంగలా? నీ కొడుకునే అడగరాదూ?”

“పొనందీసి యింటో లేదుగందా! సెప్పవేందే నీ పిల్ల బంగారంగానూ!”

“ఎ హె లేళ్ళే. అట్ట బెదుర్తావూ? పొలంపనేందో అయినేందో, పది గంటల బస్సు బూరూదిందనంగా చలగపొర దీసుకెల్లాడు.”

“పానీలే? మీ తోడికోడలు ఏవంటండదీ?”

"కాత్తె సల్లగా నమ్మోవ్, నీకు పున్నెం వుంటది! మొదలుబెట్టిందంటే తెల్లారి కోడికుయ్యాల్చిందే?"

"అయినా మీరు మీరు బాగాలు పడి ఓ పక్కీన పోతావుండారు గందా? నాకు తెలవకడుగుతా. మీ ఆయిన మరదల్ని అప్పుడప్పుడు పలకరిత్తావుంటాడెట్టా?"

"యాహోఁ– నాకెట్ట తెల్చుద్దీ!"

"నాకు మటుకేం దెల్చమ్మోవ్, బాపమ్మ అంటే యిన్నాగానీ–ఆరీర్ని అనా బేడా అప్పుడుగుతా వుంటదంటలే!"

"లేకుంటే మా మరిది మటుకేం మూటకట్టు క్కాకునుండాడెట్టా!"

"నెల్దప్పి కూకునుండే! కాత్తె ఏవిఁటి కయినా మనసుగా వుండదంటలే!"

"అయితే–"

"ఏవోఁలే నా కెందు కొచ్చింది–యిదేందీ పని బెట్టుకొచ్చి యింకీడే కూకుండానూ! కాత్తె వుప్పుగల్లుంటే పెట్టు కోడలా, మల్లీ తెల్లారి పెందలాడే తెచ్చిత్తానూ?" అంది చాసమ్మ యవారం సివరికంటాతెత్తా "యాడదత్తా! ఇంతంటే ఇంతుంటేగదూ పప్పులో ఏసి రుబ్బుతుండదీ–"

"ఎహె కాత్తె సాల్లే, వుంటే సూడూ?"

"అబ్బే ఎంతొట్టు బడ్తే అంతొట్టు! వుంటే కాత్తె బెడ్తే బంగారం పోద్దెట్టా– మొన్నటాల్నుంచి సెబుతుండా, మొదు లీమడ్చి మాట యినిపిచ్చుకుంటేగా"

"బలే కోడలవేలే! అట్ట బాపమ్మ కాడికన్నా పోతా–వత్తా కోడలోవ్" అంటా కొంగు బుజా నేసు కెల్లింది చాసమ్మ.

"ఇదేందీ–యీయన చంగతి సెబుతుండ మడ్చిని కాత్తా అటనే పోనిత్తి నేం! ఏహె పానీలె–అయినా చాసమ్మత్త వూరకనే అనే మడ్చి కాదే"–అనుకుంటా చాసమ్మ మలుపు తిరిగేదాకా చాసమ్మకెల్లి సూసింది సుద్దమ్మ. చాసమ్మ మలుపు తిరిగింది–రుబ్బుడు నిలిపి పప్పుకల్లి సూసింది సుద్దమ్మ. ఇక ఆడనే కూకుంది... ... ... కూసేపయింది – గబాల్న దొబు దొబున పప్పు సొంతం రుబ్బేసి ముంత కెత్తింది సుద్దమ్మ. మూర్తం ఒచ్చి నన్నెత్తిన కూకుండట్టు.

* * *

యీడ – ఏపనీ లేకుంటే మనసు అటిటూ లగుదోలద్దని, యీడ బఱ్ఱె పడ్డను ఆడ కట్టేసి – కాదు యాడదాన్ని ఆడే కట్టేసీ – ఎల్లి రెండు శాటల వడ్డగింజలు ముంగల

పోసుక, ఆటిలోవుంద మట్టి గెడ్డల ఏరి నోట్లో ఏసుకుంటా, ఎటూ నిలకడలేకుండ రాగమ్మకు, ఆడ తన తోడికోడలు అటు ఎల్లినట్లు ఎల్లి పప్పు రుబ్బుకొచ్చి, యవదానం లేకుండా ఎంటెంట సుఁయ్ సుఁయ్ మనిపిత్తా యింకూసేపుటికి ఆట్ని ఓదానెంట ఓటి తింటా కూకుంటదని తెరమీన బొమ్మలు కట్టినట్టు తెలిసొచ్చే తలికి - మాడుపాపిట మద్దెన పిడుగు పడ్డట్టు లెగిసి సెక్రాలు సెక్రాలుగా తిరిగిపోతా ఏడ కాడే సతికిల పళ్ళేక, యీడ కీడా దారబందానికి యాల్లాళ్ళేక, అటు మంచీలూ రుసిరాకా రాగమ్మ ఏం జేత్తుండదీ బగమంతుణ్ణిడిగి తెల్చుకు రావాల్సిందే!...

అసలు కొండయ్యా రాగవయ్యలు సయాం అన్నదమ్ములు. కొండయ్య పెల్లాం సుద్దమ్మా రాగవయ్య పెల్లాం రాగమ్మా. మొదట్లో - అంటే కొండయ్య రాగవయ్య అయ్యా అమ్మ బతికుండగా - యీరు ఆరంతా తేనెపట్టుకు మల్లె - గీగా మంటావుండి - బహు సందడిగా వుండే వోరు. కోటకు మల్లే-వుండే అంత యింట్లో, గూళ్ళల్లో వుండే పావురాళ్ళ జతలకు మల్లే.

ఈ మాట కొత్తే ఎట్టాటి సమత్తానాలు పుల్నీలు దాగి పోలా - ముసలోళ్ళిద్దరూ ఓరెంట ఓరు అట్ట దాటిపొయ్యారోలేదో - మరుసటి నెల్లో మూడు దినాలు తంటాలుబడి ఎటనో కొండయ్య చవాశేరు పుగాకు తెచ్చి సూర్లో పెట్టుకుంటే, రాగవయ్య ఆట్ని దినంనర్లో బోగిమంట ఏశాడంటా - 'ఒరే, నువ్వు ఎన్నాలు గాల్చి, ఆడోళ్లు ఎన్నాలు నోట్లో ఏసుకుంటే మటుకు చవాసేరు పుగాకు మరసనాటికీ నలుసుకుపోవాలంటరా?' అని సుద్దమ్మ పోరుపళ్ళేక కొండయ్య మాట్సామితె కంటే, 'ఓరూ?' అంటా రాగవయ్య యిశారనకొత్తావుండా, 'ఆడోరంటా డేంది కనుక్కోవేం?' అని రాగమ్మ ఎనికీడ్తే అందుకుంటే, 'అలవాటు వుండోరికి కుతి యాడికిపోద్దీ!' అంటా సుద్దమ్మ ఎగదోత్తే 'యీవెఁ మా సూసిందబ్బా!' అని రాగవయ్య బొరలుసాత్తే 'సూడబట్టేగా అనాల్సొచ్చిందీ' అంటా సుద్దమ్మా 'నూ మడిగట్టుకుండా వెట్టా?' అని రాగమ్మా కీసర బాస రాడ్తా వుంటే, 'మీరేంది వుండండే' అంటా కొండయ సేతులు అడ్డం పెడ్తా వుండా - పెంటదిమ్మలు పగిలి బోగిమంటలు సూరుకప్పుకాడికి లెగిసే తలికీ - మరసనాడే కోట రెండుగా బద్దలుకొట్టి వుజ్జీలుజ్జీలుగా జతలుపడి భాగాలు పంచుకుండారు. ఆరోరి పెలాల్తో కొండయ రాగవయలు...

కొన్నాలు సుమారుగా ఆవజాన పోతావుండారు ఆరూ యీరూ.

"ఎంత చుడి వుంటే మటుకు, అంత కడుపుబ్బరవాఁ, అంత కడుపాత్రవాఁ- నేనే కొండయబావనైతే దీనికి చికమారగట్టి రోజూ ఏపించకపొయ్యానా, తిన్నది అరిగేదాకా - ఎంత సెక్రాలు తిరుగుతా వుండా లోన రాగమ్మకు అయ్యీ యియ్యా అని పీకపోటంలా - గబాల్న బయటికెళ్ళి తుబుక్కున అట్ట వుమ్మాద్దాం అనుకుండదో లేదో రాగమ్మ-

సుద్దమ్మ దున్న కుర్ర సల్లగా ఒచ్చి రాగమ్మ గాబులో కుడితి తాగుతుండది – పచ్చడిబండతో ఒకటే దూకు రాగమ్మ – దెబ్బతో గారెలు బుట్టకాణ్ణుంచి గాలాం ఎత్తేసినట్టు బయటపడ్డది సుద్దమ్మ.

"నీకేం బుట్టిందే దున్నకుర్రను అట్ట బాత్తావ్?" అంటా నోరు దెరిసింది. సుద్దమ్మ, రాగమ్మ పచ్చడిబండతో దున్నకుర్రను ఎర్రగారం తొక్కటం సూసి...

"మా గాబులో నీరెందుకు తాగాలా? ఎన్ని చార్లు గెడ్డిపెట్టాలా."

"నీ నోట్టో పెట్టాలా పనగెడ్డీ?"

"నే నే పెట్టానే కల్లాం గెడ్డిదెచ్చి నీ నోట్టో!"

"మీ ఆయనగదంటే రేత్రిళ్లు ఆల్లీళ్ళ కళ్ళాల్లో మోపులు నూక్కొచ్చుకుందీ?"

"చాసయ్యా వావిఁలో జనపకట్టె గదంటె మీ ఆయన, ఆడ మచ్చు మీన బెట్టి. కాత్తె కాత్తె నీకు బెడ్తుందదీ?"

"అదే గదంటే మేం యింటో లేకుంటం చూసి, మీ బఱ్రెపడ్డక్కాత్తే నువు కాత్తే తింటావుంది పచ్చా?"

"నువ్వేనే దొమ్మరి పచ్చివీ! నువ్వేనే బోగం పచ్చివీ, ఒచేవ్, మీ వోరంతా పచ్చులేనే!"

ఆవజాన ఆయిఁదం డబ్బాలూ కిర్రుగానుగలూ, రావనాబ్బెమ్మ యుద్ధానికి ఒత్తావుంటే మోత పుట్టినట్టు పుద్తా వుండేతలికి చలగ పారతో అటుగా కొండయ్యా, గెడ్డపలుగుతో యిటుగా రాగవయ్యా ఒచ్చి ఎటాళ్ళటు అల్లాళ్ళ పెల్లాల కాడ నిలబడ్డారు. గోసీలు బిగిత్తా.

"ఏందే యీ జాతరా పొలం కాడికి యినొత్తుందదీ?" అని సుద్దమ్మనడిగాడు కొండయ్య.

తను పప్పు రుబ్బి, గారెలొండి, అటిటు సూత్తావుంటే, పనిలేకుండ తన తోడికోడలు పచ్చడి బండతో దున్న కుర్రను ఎట్టా బాదీ తన్ను ఎట్ట అన్నాని యన్నీ అంటా వుండదో సుద్దమ్మ సెప్పింది.

"ఆచలేందే యీ మేలం?" అని రాగమ్మ నడిగాడు రాగవయ్య.

తను వడ్లగింజలో మట్టి గెడ్డ లేర్తా కూకునుంటే. ఆల్ల దున్న కుర్రొచ్చి గాబులో వున్న కుడితి చుక్క మిగల్నీకుండా పిల్చేత్తే తను సూసి దాన్నట్ట మలపను, గాబుకాడుండ పచ్చడిబండతో అట్ట అదిలియపొయ్యే తలికి, తన తోడి కోడలొచ్చి, తన్నూ తన మొగుణ్ణే

గెడ్డిమోపులకింద పడేసి, ఎట్ట నుప్పు రాజేత్తానందీ రాగమ్మ సెప్పింది.

"ఏఁవంటావురా నువూ?" అని కొండయ రాగవయ నడిగాడు. సుద్దమ్మను కాత్తె అసంట వుండమంటా.

"మరి అదట్టరాటం రైటేనంటా?"

"చా యదవా! వయినంగా సెప్పమంటే?"

"ఓరూ? నేనా? అనే యదవనే అనుకో! మరి నీ పెళ్లాం నుప్పు రాజేసుద్దంట దానికేవఁనలా?"

"ఎవరూ?"

"నీ పెళ్లాం?"

"నుప్పేందీ?"

"గడ్డేసి మమ్ములను నుప్పు రాజేసుద్దంటగా?"

"నుప్పంటాడేందే, నూ మాట్లాడవేఁ?" అని సుద్దమ్మ నడిగాడు కొండయ.

"అదేందో నాకెట్టా తెల్చుద్దీ! ఆడ పప్పు రుబ్బుకొచ్చి యీడ గారెలు చేత్తా కూకుంటినీ! తనేవోఁ పచ్చడిబండతో దున్నకుర్రను బాత్తావుండే-"

"నిన్ను గారెలు ఓరే సెయిమందీ- వుండూ, నువ్వుండాడా- అయితే- అదిగాదురా, పచ్చడిబండతో బాదిందట దేనికిరా రాగవులూ?"

"మరి, అదావజాన పద్దాక కుడి ద్దాగి పోతావుంటే యీడ కాపరాలు పీక్క బోవాల్చిందేనంటా? దాం దుంప దెగిరి సావు మరీ అంత అన్నాయవా!"

"తేరగా ఒత్తావుంటే సేదా?" ఎంటనే అంది రాగమ్మ.

"ఎందుకు సేదవుద్దీ! సూర్లోవుండ పుగాకు పానకం దాగినట్టు తాగలా?" అందుకుంది సుద్దమ్మ.

"ఎహె, ఆతలుండూ- మద్చికి రగిలి సత్తావుంటే?" అని సుద్దమ్మను కొండయ సర్దుతా వుండాడు-

''నువ్వూ నీ దున్నకుర్రేనే మా గాబులో వుండ పాయున వంతా పడదాగుతుండారూ!" అని యిప్పి సెబతావుంది రాగమ్మ-

"ఒసే వుండే మిడతమల్లే - యీడేందో అగుపియదేం-?" అంటా ఆడకాడే సుట్టూ తిరుగుతా వుండాడు రాగవయ-

"మాకు మటుకు లేదెట్టా రుబ్బుడుపత్రం!" పచ్చడి బండకు రాగవయ్య అట్ట తిరుగుతా వుండాడని కొండయ సేయి గుంజుతుండది సుద్దమ్మ–

"ఈడ దున్న కుర్రేదే?" అంటా సుద్దమ్మ సెయి యిడిపిచ్చుకుంటా వుండాడు కొండయ–

"నీగాపురం పైచలా!" అనరిశాడు ఒచ్చిన కూసేపట్నుంచి గోడ మొత్తకాడ నిలబడి సంబరం సూత్తావుండ గొల్లపిల్లకాయ బెమ్మానందం.

ఒక్కపారిగా కొండయ సుద్దమ్మ, రాగవయ్య రాగమ్మలు – తిత్తిపగిలి తోలుముడుసుకుండట్టు–అదేందంటా బెమ్మానందకల్లి తిరిగి సూశారు.

"మీ దున్న కుర్ర బెర్రె పడ్డా అనంతయ్యగారి మాయిడితోట్లో అరక దున్నుతుండై–" అంటా మొత్తకాడ బెమ్మానందం మొత్తకాడే మాయమయ్యాడు.

"ఏందిరా రాగవులూ?" అన్నాడు కొండయ్య.

"ఆఁ– నే నేం కలగన్నానెట్టా!"

"అటమట మాట్లాడ్తావేందిరా నిదరమొగంన్నాయాలా–ఎల్దాం పదవేం?"

"ఓడంటాడు కాదనీ– మల్లీ తెల్లారుద్దిగానీ యియ్యాల్టికి కాత్తె పొలుపులు బిగియ్యండి. మీకే నమ్మోయ్" అంటా ఎల్లిపొయ్యారు, గొడ్డజత కోసం అన్నదమ్ములిద్దరూ.

"యిదేందీ! ఆడ కట్టేసుండ బర్రెపడ్డ యాడకో ఎట్టపోయిందబ్బా–దీని మొదులారా, యీ దున్నకుర్ర మడ్సా గొడ్డా–" అనుకుంటావుంది రాగమ్మ.

"తమాశాగుండదే! ఈవర్దాకా దున్నకుర్ర ఈడే తిరుగాడ్తా వుండాలా– మొదులు ఆళ్ల బర్రెపడ్డ ఎసువంటిదీ! అమ్మో అదా యిదేందీ గారెలబుట్ట ఆడే పెట్టొచ్చానూ! బలేదాన్నే–" అనుకుంటా అట్ట గుమ్మంకల్లి తిరిగిన సుద్దమ్మ– పొగురుమీనుండే కోడెదూడ వుసిమీనొచ్చి, యీపువయాన కుమ్మిన కుమ్ముడుకు మడ్చికి పోల్లెగిసి అంతరిచ్చానికి ఎల్లినట్టు– 'ఆచ్చేసుడు! ఆచ్చేసుడు!' అని అరుత్తా తంబం మయానికి రెండయినట్టు, ఎనక్కి బూమ్మీన యిరుసుకుపడి, కల్లు మూసుకుంది.

తను బొహు మనసుమీన ఎట్టాటోర్నీ లెక్కజెయకుండా, బుద్దిమల్లితే బుద్దిమల్లిన పకారం కొత్త మేదరిబుట్టలోకి గారెలుచేసుక, యీడ పనిమీన ముంగలకొచ్చి యిట్టెనిక్కి సూసేతలికి– ఒకేపాలి అయిదుగా బుట్టమీన వరసన– బుట్టలో వుండాట్ని తొంగిసూత్తా కూకునుండ అయి – అన్నీ ఒకేపాలిగా తలలెత్తి, మినుకుమినుకంటుండ పదికల్లతో సురీటిగా సుద్దమ్మను సూత్తే– బెమ్మదేవుఁడయినా ఆట్ని ఆచ్చేసుదని సేతులెత్తి దణ్ణాలు పెట్టాల్సిందే.

"ఓ అప్పోవ్-ఓ అప్పోవ్-ఏందే ఏందే?" అంటా సుద్దమ్మ కాడికి లగెత్తు కొచ్చిన రాగమ్మ, ఓపాలి కింద కల్లు మూసుకుపడుండ సుద్దమ్మను సూసి ఆమైన గుమ్మంలోనకు పరీచ్చగా సూసింది-

తను ఒడ్డగింజా బొడ్డగింజా ఏరుకుంటా వుంటే ఆడ తన తోడికోడలు సుఁయ్‌సుఁయ్‌మంటా ఒక్కొక్క గారె యాడ ఎట్టెట్ట వయినంగా పెడ్తా కూకుండదీ మనసుకు తెలవక రాగమ్మకు ఏవజాన తపనకు సెవఁట గారిందో అసువంటి దప్పికమీనుండ రాగమ్మ, ఆచ్చేసుదు ఎవరయిందీ లెక్కతెలవక గార్లెబుట్ట కల్లి ఆత్రంగా సూత్తావుంటే- ఆడ అయిదు సిట్టెలుకలు కరకట్టుగా అగుపించినై.

గబగబా అందిన కఱ్ఱోటి తీసుక తపీ తపీ ఆడీడ గోడమీన కొడ్తా సుద్దమ్మ యింటోకెల్లి- యింకూసేపటికి బయటికొచ్చింది రాగమ్మ రొప్పుకుంటా.

"అరెరెరే ఎంత తమాశగుందీ! అదేందో దేవతా చర్పం అంటారు అదే గావాలా! యాడన్నా మంచోసన వుంటే ఒత్తయ్యంటగానీ- అయ్యేం మదుసుల జోలికి రావంటలే అప్పా! అదెప్పుడో ఎల్లిపోయిందిలే లెగు లెగూ- ఎల్లికూడొండు కోవాల, యాలయింది!" అంటా సుద్దమ్మను కన్ను తెరిపిచ్చి ధైర్యం చెబుతా తన పనిమీన తనెల్లింది రాగమ్మ, కోక సవిరిచ్చుకుంటా.

తన తాత ముత్తాతలు ఎవురేడ మొక్కుండారో- అసలు వుండకాడికి సగం గారెలు అగుపియకపోతే ఆచ్చేసుడి మొక్కు ఆవజాన తీరిందనుకుంటా, ఒత్తావుండ నాగుల్సవితికి అర్సోలెడు పాలు మొక్కుండది సుద్దమ్మ.